సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

నేడు డయల్ యువర్ ఎమ్మెల్యే

డాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సోమవారం ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించనున్నారు. ఫిర్యాదీదారులు 99519 92777, 99519 93777 నంబర్లకు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయవచ్చు. దక్షిణ నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

కాకినాడ వెళ్లి పింఛన్ అందజేత



కాకినాడ వెళ్లి మహ్మద్ గౌసియా బేగంకు పింఛన్ అందిస్తున్న వార్డు వెల్ఫేర్ సెక్రటరీ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–4 పరిధి 38వ వార్డుకు చెందిన మహ్మద్ గౌసియా బేగం గత కొంతకాలంగా మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతున్నారు. ఆమె చికిత్స కోసం కాకినాడలో ఉంటున్నారు. ఇటీవల ఆమె డయాలసిస్ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల మంజూరైన నూతన పింఛన్లలో ఆమె పేరుంది. ఈ నెల పింఛన్ తీసుకోకపోతే వెనక్కి వెళ్లిపోయే అవకాశం ఉంది. దీంతో వార్డు వెల్ఫేర్ సెక్రటరీ ముత్యాల రామకృష్ణ కాకినాడలో ఉంటున్న మహ్మద్ గౌసియా బేగం వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము రూ.10వేలు అందజేశారు. రామకృష్ణకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



నృత్యం చేస్తున్న కళాకారులు వైదా వేద్య, ప్రహర్షిత

బీచ్ రోడ్డు: సాగరతీరంలోని అన్నమయ్య వేదిక వద్ద ఆదివారం తారకేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. ఎస్ఎస్‌వీ సత్యభామ శిష్యులు వైదా వేద్య, ప్రహర్షిత తమ నృత్య ప్రదర్శనలతో అలరించారు. అనంతరం శాస్త్రీయ నృత్య పోషక్ ఉపాహారం అవార్డులతో నృత్యకారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యుడు ఇంద్ర మోహన్, స్వామి జ్ఞాన ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో వైభవంగా పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజలు వైభవంగా జరిగాయి. శ్రీ రాధాదామోదరులను ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం పూజలు నిర్వహించారు. హరే రామ హరే కృష్ణ కీర్తనలు, అభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాతనగరానికి పండగ శోభ

కిక్కిరిసిన జగదాంబ జంక్షన్, రోడ్లు



కిక్కిరిసిన జగదాంబ జంక్షన్

డాబాగార్డెన్స్/జగదాంబ: పాతనగరం పండగ శోభ సంతరించుకుంది. సంక్రాంతి ముందు వచ్చిన ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో కొనుగోలుదారులు జగదాంబ జంక్షన్‌కు రావడంతో పెద్ద షాపింగ్‌మాల్స్‌తోపాటు ఫుట్‌పాత్ మార్కెట్ కూడా కళకళలాడింది. డాబాగార్డెన్స్ మెయిన్‌రోడ్డులో గల షాపింగ్ మాల్స్‌తోపాటు వస్త్ర దుకాణాలకు కొనుగోలుదారులు క్యూ కట్టారు. ఓ వైపు సెల్‌దుకాణాలు, మరోవైపు వస్త్ర దుకాణాలకు జనం క్యూ కట్టడంతో డాబాగార్డెన్స్ మెయిన్‌రోడ్డుతోపాటు పలు ప్రాంతాలు కిటకిటలాడాయి. ముఖ్యంగా పోలీస్ బ్యారెక్స్, పందుపుల్లల వస్త్ర దుకాణాల వద్ద ఇసుక వేస్తే రాలనంత జనం ఉంటున్నారు. నిత్యావసర సరకుల కొనుగోలు దుకాణాలు, పిండి మిల్లుల వద్ద జనం క్యూ కట్టారు. జగదాంబ నుంచి పూర్ణామార్కెట్ వరకు పరిసర ప్రాంతాలల్లో వ్యాణిజ్య సముదాయలన్నీ బిజీగా ఉండడంతో ఏ రోడ్డు కూడా ఖాళీగా ఉండడం లేదు. ఇదే అదునుగా జేబు దొంగలు రెచ్చిపోతున్నారు. అయితే పోలీసులు కూడా ముందుస్తుగా ఆటోలు, జీపులు ద్వారా జేబుదొంగలు ఉన్నారంటూ ప్రచారం చేస్తున్నారు. మరికొందరు పోలీసులు మఫ్టీలో నిఘా కాస్తున్నారు.

ట్రాఫిక్‌తో ఇబ్బందులు : మరోవైపు జగదాంబ జంక్షన్‌కు వెళ్లాలంటే ముప్పుతిప్పలు పడాల్సి వస్తోందని నగరవాసులు బెంబేలెత్తిపోతున్నారు. ఇసుక వేస్తే రాలనంతగా జనం తరలిరావడంతో ఇటు పాదచారులు, వాహనచోదకులు జంక్షన్‌కు వెళ్లాలన్నా... జంక్షన్ మీదుగా కేజీహెచ్, కలెక్టర్ కార్యాలయం, బీచ్‌కు పోవాలన్నా... టర్నర్‌చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, టౌన్ కొత్తరోడ్డుకు వెళ్లాలన్నా అవస్థలు పడాల్సి వస్తోంది. ట్రాఫిక్ రద్దీని నియంత్రించడంలో ట్రాఫిక్ పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. జగదాంబ పరిసర ప్రాంతాల్లో ఉన్న గల్లీలన్నీ వాహనాల పార్కింగ్‌తో పూర్తిగా నిండాయి. మసీదు జంక్షన్, ఎల్లమ్మతోట, కేజీహెచ్ అప్‌రోడ్డు, దేవరవీధితోపాటు జగదాంబ జంక్షన్, లేపాక్షి జంక్షన్, ప్రకాశరావుపేట జంక్షన్ తదితర ప్రాంతాలన్నీ ద్విచక్ర, కార్ల పార్కింగ్‌తో నిండిపోయాయి.



చెప్పల దుకాణాల వద్ద కొనుగోలుదారులు



పోలీస్ బ్యారెక్స్ వద్ద జనం

వివేకానంద సంస్థలో అన్నదానం



అన్నసమారాధన నిర్వహిస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్

డాబాగార్డెన్స్: స్వామి వివేకానంద సంస్థ గౌరవ సభ్యుడు, సంఘ సేవకుడు ఎంఎస్ఎన్ పాత్రుడు సంతాప సభ ఆదివారం జరిగింది. వివేకానంద సంస్థలో జరిగిన ఈ కార్యక్రమంలో పాత్రుడి చిత్ర పటానికి సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, డాక్టర్ ముస్తాఫ్ అహ్మద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ సంస్థ సేవా కార్యక్రమంలో పాల్గొంటూ, సలహాలు, సూచనలిస్తూ సంస్థను ముందుకు నడిపించిన వ్యక్తిని కోల్పోయామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవ సలహాదారులు పోతురాజు, కోదండ రావు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలతో ఎమ్మెల్యే పిక్నిక్



పిక్నిక్‌లో కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదివారం కార్యకర్తలతో ఎంజాయ్ చేశారు. కార్యకర్తల్లో ఉత్తేజం నింపేందుకు పిక్నిక్ ఏర్పాటు చేశారు. అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలో నిర్వహించిన పిక్నిక్‌కు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీ కార్యకర్తలు తరలివెళ్లారు. పలు వార్డుల కార్పొరేటర్లు, అధ్యక్షులు, పలు విభాగాల డైరెక్టర్లు, పలువురు పార్టీ నాయకులు పిక్నిక్‌కు వెళ్లి సందడి చేశారు. కార్యకర్తలతో ఎమ్మెల్యే ఆట, పాట నిర్వహించారు. గుర్రాలు, ఒంటెలు, రంగులరాట్నం, బాతుల రింగ్ గేమ్, వాలీబాల్, షటిల్ వంటి క్రీడా పోటీలతో పాటు డీజే, డాన్స్ బేబీ, తీన్మార్ బేండ్‌తో ఉర్రూతలూగించారు. పసందైన విందు ఆరగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎంజాయ్ చేసిన వీరంతా సాయంత్రం ఇళ్లకు చేరుకున్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



మందులు అందిస్తున్న ఘోషాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ ఉషా

డాబాగార్డెన్స్: సయ్యద్ ఇలియాస్ మహ్మద్ తండ్రి సయ్యద్ మీర్ మహ్మద్ జ్ఞాపకార్థం ఆదివారం పాతనగరం జాలరిపేట వద్ద నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని ప్రభుత్వ విక్టోరియా హాస్పటల్ (ఘోషాస్పత్రి) సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ ఉషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెద జాలరిపేట వాసులకు ఉచితంగా రక్త పరీక్షలు, ఫిజియోథెరపీ, గైనిక్ సేవలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేయడం గొప్ప విషయమన్నారు. తమ వంతు వైద్య సహాయం ఎప్పుడూ ఇటువంటి శిబిరాలకు ఉంటుందన్నారు. వైద్య శిబిరం నిర్వాహకుడు, కొత్తకోట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ ఇలియాస్ మహ్మద్ మాట్లాడుతూ ప్రతి నెలా రెండు సార్లు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గత మూడేళ్లుగా తల్లి దండ్రుల పేరిట అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి పైల సన్నిబాబు, డాక్టర్ కూర్మనాథ్, డాక్టర్ డి.సుధాకర్ పట్నాయక్, డాక్టర్ అచ్యుత రావు, డాక్టర్ అమీర్, 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్ డాక్టర్ గోపి మామిడి, హిమా హ్యూమానిటేరియన్ సంస్థ వ్యవస్థాపకుడు టీవీడీ దాస్, వై.శ్రీనివాస్, కేజీహెచ్ స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్స్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

అల్లిపురం: బంగారుమెట్ట, శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీ శివాని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మహిళలు, వృద్ధులకు బీపీ, షుగర్‌తోపాటు ఇతర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది అవసరమైన మందులు సూచించారు. అత్యవసరమైన వారికి చికిత్స నిమిత్తం సిఫార్సు చేశారు. సమాజం కార్యవర్గ సభ్యులు ఏర్పాట్లు చేశారు. శిబిరంలో సుమారు 80 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలు



చిల్డ్రన్ క్లబ్‌లో పుస్తకాలు చదువుకుంటున్న చిన్నారులు



గ్రంథాలయాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది, పాఠకులు

అల్లిపురం: గ్రంథాలయాలు సరస్వతి నిలయాలు అని, వాటిని ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని అల్లిపురం శాఖా గ్రంథాలయ అధికారి పీవీ ఎస్ రాజు అన్నారు. ఆదివారం గ్రంథాలయాన్ని పాఠకులు, సిబ్బందితో కలసి మనం–మన గ్రంథాలయం కార్యక్రమంలో భాగంగా శుభ్రం చేశారు. పుస్తకాలను కేటగిరీల వారీగా సర్దిపెట్టారు. ర్యాకులపై, పుస్తకాలపై పేరుకుపోయిన దుమ్మును శుభ్రపరిచారు.

చిన్నారులతో పుస్తక పఠనం

గ్రంథాలయంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న చిల్డ్రన్ క్లబ్‌లో భాగంగా చిన్నారులు గ్రంథాలయానికి చేరుకుని వారికి కావాల్సిన పుస్తకాలను తీసుకుని చక్కగా చదువుకున్నారు. వారికి గ్రంథాలయ పాఠకుడు, పి.రాజశేఖర్ పుస్తకాలు, వాటి విలువను తెలియజేశారు. పుస్తకం మంచి మిత్రుడు అని సూచించారు. నిరంతరం పుస్తక పఠనం వల్ల విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు కాన్వెంటు కూడలి జ్ఞానాపురంలో వెలసిన ఎర్ని మాంబ అమ్మవారి ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. ఆలయ ఈవో సురేష్‌బాబు నేతృత్వంలో పూజారి ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక, ఉచిత దర్శనాలు ఏర్పాటు చేశారు. వంటవార్పు చేసుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



గొబ్బెమ్మల చుట్టూ కూర్చుని పూజలు చేస్తున్న చిన్నారులు



కోలాటం ఆడుతున్న చిన్నారులు

అల్లిపురం: సంక్రాంతిని పురస్కరించుకుని ఆదివా రం డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంలో నిర్వహించి న ముగ్గుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. ప్రేమ సమాజంలోని పిల్లలు, మహిళలు వేసిన ముగ్గులు చూపరులను ఆకట్టుకున్నాయి. సంక్రాంతి ముగ్గులను రంగులు, బంతిపూల రేకులు, గొబ్బెమ్మలతో విశేషంగా అలంకరించారు. గొబ్బె మ్మల వద్ద సంక్రాంతి లక్ష్మికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సమాజం చిన్నారులు, మహిళలు కోలాటం ఆడి అలరించారు.

మా కడుపులు కొట్టొద్దు

కంచరపాలెం మార్కెట్ మూసివేతపై వ్యాపారుల ఆందోళన



మార్కెట్ బయట ధర్నా చేస్తున్న చిరు వ్యాపారులు

కంచరపాలెం: దశాబ్దాల కాలంగా ఇక్కడే కూరగాయలు, చేపలు అమ్ముకుంటున్న తమపై గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం నాయకులు కక్ష కట్టి మార్కెట్‌ను ఖాళీ చేసే ప్రయత్నం చేయడం దుర్మార్గమని వ్యాపారులు ఆదివారం ఆందోళనకు దిగారు. శనివారం అర్ధరాత్రి మార్కెట్‌కు తాళాలు వేసి వ్యాపారాలు జరగకుండా ఇసుక, మట్టి రహదారికి అడ్డంగా వేయడంతో చిరు వ్యాపారులు ఆదివారం ఆందోళన చేపట్టారు. మీడియాతో వారు మాట్లాడుతూ ఏ సంబంధం లేని గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం సభ్యులు 70 ఏళ్లుగా అద్దెలు, కరెంటు బిల్లుల రూపంలో ఆశీలు వసూలు చేస్తున్నారని తెలిపారు. కంచరపాలెం మెట్టుపై స్థలాన్ని ఆక్రమించడమే కాకుండా, వ్యాపారులను ఆశీల రూపంలో దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ స్థలంలో భారీ భవనాన్ని నిర్మించి తమనే తరిమేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆర్డీవో, కలెక్టర్‌లను ఆశ్రయించామని చెప్పారు. కోర్టులో స్టే ఆర్డర్ ఉన్నప్పటికీ నిర్మాణాలు ఆపకుండా వ్యాపారాలను అడ్డుకుని తమ పొట్ట కొట్టడం అన్యాయమని వాపోయారు. ఆదివారం మార్కెట్ నిలిచిపోవడంతో ఇక్కడ వ్యాపారాలు చేస్తున్న 142 దుకాణాల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. మార్కెట్‌కు తాళాలు వేయడంతో తెచ్చిన కూరగాయలు, చేపలు నష్టపోయామన్నారు. తమ స్థలంలో వ్యాపారాలు చేయనివ్వకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వ్యాపారులు కోరారు. రహదారిపై బైఠాయించి ధర్నా చేస్తున్న వ్యాపారులతో ఆదివారం డీసీపీ–2 ఆనందరెడ్డి, ఏసీపీ నరసింహమూర్తి, సీఐ విజయకుమార్ మాట్లాడారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చినట్లు వ్యాపారులు తెలిపారు.

సందడిగా కేరళ ఉత్సవాలు



ఆకట్టుకుంటున్న క్రీస్తు జననం సెట్



గీతాలాపన చేస్తున్న కేరళ బ్యాండ్ పార్టీ

మురళీనగర్: నగరంలోని కేరళీయులందరూ క్రిస్మస్‌తోపాటు నూతన సంవత్సర వేడుకలను బిర్లా కూడలిలోని కళా సమితి ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం ఘనంగా జరుపుకున్నారు. కేరళ మలబార్ చర్చి ఫాదర్ రెవరండ్ జోఫీ చిరయాత్ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం కేరళ నుంచి వచ్చిన ఆర్కెస్ట్రా క్రీస్తు స్తుతి గీతాలు ఆలపించారు. క్రీస్తు జనన వృత్తాంతాన్ని తెలుపుతూ ఏర్పాటు చేసిన అలంకరణ ఆకట్టుకుంది. నగరంలోని కేరళీయులందరూ తరలివచ్చి సందడి చేశారు. కార్యక్రమంలో కేరళ కళా సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ఎం పిళ్లై, కె.హరిదాస్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఉదారత

కంచరపాలెం: సేవ చేసేందుకు ఎల్లలు లేవని సాలగ్రామపురం పోర్ట్ స్కూల్ పూర్వ విద్యార్థులు అన్నారు. ఈ స్కూల్‌లో చదివి అమెరికాలో స్థిరపడిన సిరాజ్ పంపిన ఆర్థిక సాయంతో విశాఖ పోర్ట్ స్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం పాఠశాల ఆవరణలో సంఘ అధ్యక్షుడు ఎస్.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పోర్ట్ అండ్ డాక్ ఫెడరేషన్ కార్యదర్శి గొర్లె చందు, ట్రస్టీ ఆర్.రమణబాబు, సేవ్ స్కూల్ కమిటీ చైర్మన్ తుమ్మల త్రినాథ్, ఐటీసీ మేనేజర్ వసుంధర మాట్లాడారు. ఈ సందర్భంగా ఆటో మరమ్మతుల కోసం భాషా అనే పూర్వ విద్యార్థికి రూ.50 వేలు చెక్కు, మరో ముగ్గురు విద్యార్థులకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేల నగదు అందజేశారు. మరణించిన 16 మంది పూర్వ విద్యార్థుల కుటుంబాలకు సరకులు పంపిణీ చేశారు. సంఘ కార్యదర్శి వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమంగా ఉక్కు పోరాటం

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అని, దానిని ఎలా ప్రయివేటుపరం చేస్తారని మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులు నడుపూరు గాంధీ పార్కు ఎదుట ఆదివారం ఉదయం 8 గంటలకు 24 గంటల నిరాహారదీక్షను ప్రారంభించారు. వీరి దీక్షకు నడుపూరు గ్రామ ప్రజలు, కాంట్రాక్ట్ కార్మికులు, స్టీల్ కార్మికులు, అఖిల పక్షాల కార్మిక సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు సంఘీభావం తెలిపా రు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణపై కేంద్రం ప్రభుత్వం నిర్ణయం వెనక్కి తీసుకునే వరకూ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ పోరాటాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా జర్నలిస్ట్‌ల క్రికెట్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: జర్నలిస్ట్‌ల స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. పోర్ట్ స్టేడియంలో ఆదివారం జరిగిన సెమీస్ పోటీలను ఎంపీ జి.వి.ఎల్.నరసింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్ట్‌లకు ఆట విడుపు అవసరమన్నారు. తొలి సెమీస్‌లో కెమెరామెన్ జట్టు 31 పరుగుల తేడాతో సాక్షి జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన కెమెరామెన్ జట్టు ఏడు వికెట్లకు 151 పరుగులు చేయగా.. దుర్గా, సుధీర్, నవాజ్ రెండేసి వికెట్లు తీశారు. సాక్షి జట్టు ఏడు వికెట్లే కోల్పోయినా.. 120 పరుగులకు ఇన్నింగ్స్ ముగించింది. దుర్గ 34 పరుగులు, సుధీర్ 20 పరుగులు చేశారు. కెమెరామెన్ ప్రేమ్‌కుమార్ మూడు వికెట్లు తీసి మ్యాచ్ బెస్ట్‌గా నిలిచాడు. ఏపీ మారిటైం బోర్డ్ చైర్మన్ కాయల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
7997958342, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ సౌత్
9010196663
Office mail : sakshiadvtvsp@gmail.com